
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 14 । ఫిబ్రవరి । 2024



సోమశిలలో 21.895 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 21.895 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3,500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.64,290
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,774
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,947
నవర (8 గ్రాములు)	రూ.47,576



వాతావరణం

మంగళవారం గాలిలో తేమ 66 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. బుధవారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్‌కు 13 ప్రాజెక్టులు ఎంపిక

నెల్లూరు(టౌన్): రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్‌కు జిల్లా నుంచి 13 మంది విద్యార్థుల ప్రాజెక్ట్ నమూనాలు ఎంపికయ్యాయి. మంగళవారం స్థానిక పొదలకూరు రోడ్డులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఇన్‌స్పైర్ మనక్‌లో జిల్లాస్థాయిలో మొత్తం 154 ప్రాజెక్ట్ నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. వీటిలో ఉత్తమమైన 13 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. విద్యార్థులు కె.అమోఘవర్ష, టి.ప్రణవిక, వెంకటధరన్, సీహెచ్ ఆకాష్, అక్షయ్‌మహదేవ్, ధనుష్‌గుప్తా, సఫయాన్, నిఖిత, నాయబ్‌రసూల్, షేక్ తహసీనా, ముస్కాన్, విజయ్, ఫాతిమా రూపొందించిన ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి.

ప్రశాంతంగా బీఏ ఎల్‌ఎల్‌బీ పరీక్షలు



పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న వీసీ సుందరవల్లి

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో బీఏ ఎల్.ఎల్.బి. పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నిర్వహించిన మూడో సెమిస్టర్ పరీక్షలకు 443 మంది, మధ్యాహ్నం నిర్వహించిన ఐదో సెమిస్టర్ పరీక్షలకు 372 మంది హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ తీరును వీఎస్‌యూ వైస్ చాన్సలర్ జీఎం సుందరవల్లి, రిజిస్ట్రార్ పి.రామచంద్రారెడ్డి తదితరులు పరిశీలించారు.

పోర్టుకు చేరనున్న కంటైనర్ వెజల్

ముత్తుకూరు: కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ కార్యకలాపాలు కొనసాగించేందుకు త్వరలో కంటైనర్ వెజల్ రానుంది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కృషి, పోర్టు యాజమాన్యంతో మంత్రి జరిపిన సంప్రదింపుల ఫలితంగా 1000 కంటైనర్ల సామర్థ్యంతో కృష్ణపట్నంకు భారీ వెజల్ చేరుకోనుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తన విజ్ఞప్తి మేరకు యాజమాన్యం వెజల్ తీసుకువచ్చేందుకు చేపట్టిన చర్యలకు ధన్యవాదాలు తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ప్రజల పక్షాన నిలిచి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల విడుదల

నెల్లూరు(టౌన్): నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ మంగళవారం జేఈఈ మెయిన్స్ ఫలితాలను విడుదల చేసింది. జేఈఈ మెయిన్స్ పరీక్షలు గత నెల 24 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు జరిగాయి. జిల్లాలో 4 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించగా, జిల్లావ్యాప్తంగా మొత్తం 16 వేల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు హవా సృష్టించారు. షేక్ సూరజ్ 300కు 300 మార్కులు సాధించారు. అలాగే రితేష్‌రెడ్డి 99.922 పర్సంటైల్, శ్రీనికేష్ 99.917, చరితసాయి సుష్మ 99.900, లావణ్య చంద్రిక 99.831, అభితేష్ 99.776, సాయినితీష్ 99.771, దినేష్‌కార్తీక్ 99.741, శ్రీరామ్‌సుహాస్ 99.727, విరించి 99.711 పర్సంటైల్ సాధించి సత్తా చాటారు.

ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యం : షేక్ సూరజ్



సూరజ్ ధనలక్ష్మీపురంలో నివాసం ఉంటున్నాడు. తండ్రి ధరియసాహెబ్ ప్రైవేట్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. తల్లి మల్లేశ్వరి గృహిణి. ఎన్‌టీఏ విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సూరజ్ 300కు 300 మార్కులు సాధించాడు. బాంబే ఐఐటీలో సీటు సాధించి సాఫ్ట్‌వేర్‌గా స్థిరపడాలన్నదే తన లక్ష్యమని చెబుతున్నాడు.

సాఫ్ట్‌వేర్ సంస్థను స్థాపిస్తా : రితేష్‌రెడ్డి



రితేష్ కావలిలో నివాసం ఉంటున్నాడు. తండ్రి వెంకారెడ్డి రైతు కూలీగా పని చేస్తున్నారు. తల్లి అపర్ణ గృహిణి. రితేష్‌రెడ్డి జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 99.92 పర్సంటైల్ సాధించాడు. ఐఐటీలో సీటు సాధించి భవిష్యత్‌లో సాఫ్ట్‌వేర్ సంస్థను నెలకొల్పడమే తన ఆశయమని చెబుతున్నాడు.

ఇవే మా ఇళ్లు



ఇల్లు లేని పేదలందరికీ గూడు కల్పించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. గత టీడీపీ ప్రభుత్వం పేదలకు ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన విషయంలో ఘోరంగా విఫలమైంది. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల సొంతింటి కలను నెరవేరుస్తోంది. అలాగే పట్టణ పేదల కోసం నిర్మించిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించేలా చర్యలు చేపట్టింది. నేడు వేలాది మంది లబ్ధిదారులకు టిడ్కో గృహాలను అందిస్తోంది.

పేదల సొంతింటి కల నిజం చేస్తున్న జగనన్న సర్కార్

- గత టీడీపీ హయాంలో చేసిన తప్పిదాలకు ప్రస్తుత ప్రభుత్వంలో పరిష్కారం
- నేడు టిడ్కో గృహాలను అందజేయనున్న మంత్రి ఆదిమూలపు సురేష్
- 15,552 మందికి ప్రయోజనం
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

నెల్లూరు(బారకాసు): గత టీడీపీ ప్రభుత్వంలో చేసిన తప్పిదాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిష్కారం లభిస్తోంది. పేదల సొంతింటి కల సాకారమవుతోంది. పేదలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారు. తద్వారా టీఐడీసీఓ అంటే టిడ్కో (టౌన్‌షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ద్వారా నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని లబ్ధిదారుల (పట్టణ పేదల) కోసం అల్లీపురం, వెంకటేశ్వరపురం, అక్కచెరువుపాడు, కొండ్లపూడి, కల్లూరుపల్లి, ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మించిన టిడ్కో గృహాలు బుధవారం 15,552 మంది పేదల సొంతం కానున్నాయి. ఇందు కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



నెల్లూరులోని టిడ్కో గృహ సముదాయం

ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన టిడ్కో చైర్మన్

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించే కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం టిడ్కో చైర్మన్ జమ్మన ప్రసన్నకుమార్ పరిశీలించారు. కార్యక్రమానికి హాజరయ్యే లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలని చైర్మన్ అధికారులకు సూచించారు. ఆయన వెంట టిడ్కో చీఫ్ ఇంజినీర్ మరియన్న, ఎస్‌ఈ కె.జాన్‌సైమన్ రావు, ఈఈ ఉమాశంకర్‌శాస్త్రి, డీఈఈ రంగయ్య, కోఆర్డినేటర్ రమాసుబ్బు ఉన్నారు.

ఎక్కడెక్కడ.. ఎన్నెన్ని గృహాలంటే..

అల్లీపురం	7,440
అక్కచెరువుపాడు	1,920
కల్లూరుపల్లి	1,584
కొండ్లపూడి	2,208
వెంకటేశ్వరపురం	2,352
ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద	48
మొత్తం	15,552

ఆశయం నెరవేరుతోంది

అందరికీ ఇల్లు ఉండాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం నెరవేరుతోంది. పట్టణ పేదల కోసం నిర్మించిన టిడ్కో ఇళ్లు పంపిణీకి సిద్ధమయ్యాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణం చేపట్టినా మౌలిక వసతుల కల్పన విషయంలో ఘోరంగా విఫలమైంది. టిడ్కో ఇళ్లకు సంబంధించి చంద్రబాబు ప్రభుత్వంలో నిర్మాణ వ్యయాన్ని భారీగా పెంచేసి అవినీతికి పాల్పడితే. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రివర్స్ టెండరింగ్ నిర్వహించి టిడ్కో ఇళ్ల నిర్మాణ ఖర్చును ఆదా చేసింది. వైఎస్ జగన్ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా వ్యవహరిస్తూ మూడు కేటగిరీల్లో ఇళ్లను నిర్మిస్తోంది. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఇప్పటి వరకు 4 వేల మంది లబ్ధిదారులకు ఇళ్లను అందించింది.



₹1కే ఇల్లు

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అల్లీపురం టిడ్కో గృహ సముదాయంలో బుధవారం ఉదయం 10 గంటలకు జరిగే టిడ్కో గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చేతుల మీదుగా లబ్ధిదారులకు గృహాలు పంపిణీ చేయనున్నారు. దీంతో నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో టిడ్కో ఇళ్లను అందుకుంటున్న 15,552 మంది లబ్ధిదారులు సంబరపడిపోతున్నారు. 300 చదరపు అడుగుల గృహాలకు గత ప్రభుత్వం రూ.2.65 లక్షల చొప్పున బ్యాంకు రుణాన్ని అందజేసింది. లబ్ధిదారు 20 సంవత్సరాల్లో చెల్లించాల్సిన మొత్తం రూ.7.20 లక్షలు. అయితే ఈ ప్రభుత్వం ఆ గృహాలను కేవలం ఒక్క రూపాయి తీసుకొని ఇవ్వడంతో వారి ఆనందానికి అవధులు లేవు. అలాగే 365 చదరపు అడుగుల ఇళ్లకు లబ్ధిదారుడు గతంలో రూ.50 వేలు చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడు రూ.25 వేలు చెల్లిస్తే సరిపోతుంది. 430 చదరపు అడుగులు కలిగిన ఇల్లు పొందిన లబ్ధిదారుడు గత ప్రభుత్వంలో రూ.లక్ష తన వాటాగా చెల్లించాల్సి వచ్చేది. కానీ ప్రస్తుతం రూ.50 వేలు చెల్లించి ఇల్లు పొందే అవకాశాన్ని ప్రస్తుత ప్రభుత్వం కల్పించింది. గత ప్రభుత్వంలో ఈ ఇళ్ల రిజిస్ట్రేషన్ ఖర్చులు లబ్ధిదారులే భరించాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు రూ.75 వేలు రిజిస్ట్రేషన్ ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. టిడ్కో హౌసింగ్ కాలనీల్లో సురక్షితమైన మంచినీటి పథకం, విద్యుత్ సరఫరా, సిమెంట్ రోడ్లు, డ్రైనేజ్ సౌకర్యం తదితర మౌలిక వసతులను కల్పించి లబ్ధిదారులకు నివాసయోగ్యమైన పరిస్థితులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో టిడ్కో గృహాల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



మేము సొంతిల్లు లేక బాడుగ ఇంట్లో ఉంటున్నాం. ప్రతి నెలా అద్దె చెల్లించడానికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇలాంటి సమయంలో సీఎం జగన్ సార్ మాకు ఇల్లు మంజూరు చేశారు. ఆ ఇంటిని మాకు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం. – రామకృష్ణ విజయ్‌కుమార్, లబ్ధిదారుడు, వైఎస్సార్ నగర్

ఎప్పటికీ గుర్తుంచుకుంటాం



జీవితంలో ఇల్లు కట్టుకోలే మనుకున్నాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత టిడ్కో ఇళ్ల ద్వారా మా సొంతింటి కలనెరవేరింది. జగన్ సార్ మాకు చాలా మేలు చేస్తున్నారు. మా నాయకుడు ఎప్పటికి జగన్ సారే. ఆయనే మరోసారి సీఎంగా రావాలని కోరుకుంటున్నాం. ఎప్పటికీ ఆయనను గుర్తుంచుకుంటాం. – లక్ష్మీప్రసన్న, లబ్ధిదారు, నక్కలగుంట

లవ్ ఫర్ ఎవర్

ప్రేమికుల రోజు స్పెషల్



ప్రేమ.. అదో మధురమైన అనుభూతి.. ఈ ప్రేమ కొందరి జీవితాల్లో సంతోషాల పంట. యువతీ యువకులు చదువుకునే రోజుల్లోనే ఒకరినొకరు ఇష్టపడి ప్రేమించుకుంటారు. కొందరు తల్లిదండ్రులను ఒప్పించి ప్రేమ పెళ్లిళ్లు చేసుకుంటే.. మరికొందరు వారిని ఎదిరించి దంపతులవుతారు. ఎలాగైతేనేం నిండునూరేళ్లు ఆనందంగా జీవిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

స్కూల్ డేస్ నుంచే..

నెల్లూరు నగరంలోని 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డి కాలనీకి చెందిన పిన్నమిరాజు శివరామప్రసాద్, 53వ డివిజన్ వెంకటేశ్వరపురం ప్రాంతానికి చెందిన కల్పనల మధ్య చదువుకునే రోజుల్లోనే స్నేహం చిగురించింది. కాలేజీ రోజుల్లో ఒకరినొకరు ఇష్టపడి ప్రేమలో పడ్డారు. వీరిద్దరి ప్రేమ విషయం తెలిసిన కల్పన తల్లిదండ్రులు అడ్డుచెప్పడంతో 2006 ఫిబ్రవరి 9వ తేదీన స్నేహితుల సహకారంతో ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి అరుణ్, హర్ష ఇద్దరు సంతానం. శివరామప్రసాద్ వార్డ్ నం.54, బకాసుర, బుల్లెట్ బాబు తదితర సినిమాల్లో హీరోగా నటిస్తూ వర్ధమాన నటుడిగా ఎదుగుతున్నారు. కల్పన నెల్లూరు మెప్మాలో ఆర్పీగా కొనసాగుతున్నారు. వీరి జీవితం అన్యోన్యంగా సాగుతోంది. ఈ దంపతుల ప్రేమ ప్రయాణం నిండు నూరేళ్లు సాగాలని ఆశిద్దాం.



– నెల్లూరు(వీఆర్సీసెంటర్)



ప్రేమను నిలుపుకున్నాం

వీరు ఆత్మకూరు పట్టణానికి చెందిన మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ సందాని – షేక్ ముజీబున్నీసా దంపతులు. 30 ఏళ్ల క్రితం సందాని అనంతసాగరం నుంచి ఆత్మకూరుకు చదువుకొనేందుకు వచ్చారు. మెడికల్ ల్యాబ్ శిక్షణ పొంది ఓ ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తున్నాడు. అప్పట్లో ఎల్ఆర్‌పల్లిలో నివాసం ఉంటున్న ఆయనకు అదే ప్రాంతానికి చెందిన షేక్ ముజీబున్నీసా పరిచయమయ్యారు. వారి పరిచయం ప్రేమగా మారింది. వీరి ప్రేమను ఇరు కుటుంబాల్లో తొలుత అంగీకరించలేదు. ఎట్టకేలకు పెద్దలను ఒప్పించి 1998లో వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. ఎంతో అన్యోన్యంగా కాపురం చేస్తున్న వీరు ప్రేమికులకు చెప్పేదేమిటంటే 'ప్రేమించడం గొప్ప కాదు.. దానిని నిలుపుకోవాలి.. పెద్దలను ఒప్పించి వివాహం చేసుకోవాలి. ఒకరిపై ఒకరికి నమ్మకం ఉంటే ఆ కాపురం కలకాలం సంతోషంగా ఉంటుందని' చెబుతున్నారు. – ఆత్మకూరు

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

- రూ.374 కోట్లతో బడ్జెట్ ఆమోదం
- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు(పొగతోట): రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని జిల్లావ్యాప్తంగా నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. మంగళవారం నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో 2023–24 బడ్జెట్ సవరణ, 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనాల బడ్జెట్‌పై నిర్వహించిన జెడ్పీ అత్యవసర సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ముందుగా విడవలూరు ఎంపీపీ వేణుంబాక భవానమ్మ మృతికి సంతాపం తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.374 కోట్ల అంచనాలతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మంచినీటి ఎద్దడి నివారణకు ముందస్తు నిధులు మంజూరు చేస్తున్నామని, మంచినీటి సమస్యలను జిల్లా మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సోమశిల హైలెవల్ కెనాల్ నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు చేపడతామని తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో నికరం రూ.157.89 కోట్లు కాగా, ఖర్చు రూ.161.05 కోట్లు ఉందన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.366.89 కోట్ల అంచనాల బడ్జెట్ కాగా, వ్యయం రూ.326.36 కోట్లు అయిందన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సవరణ అంచనాల బడ్జెట్ రూ.348.20 కోట్లు కాగా, వ్యయం రూ.281.25 కోట్లుగా ఉందన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరం అంచనాల బడ్జెట్ రూ.374.43 కోట్లు కాగా, వ్యయం రూ.297.41 కోట్లకు ఆమోదించినట్లు తెలిపారు. ఆమోదించిన బడ్జెట్‌ను జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లా మంత్రి దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించేలా చర్యలు చేపడతామన్నారు. ఉదయగిరి ప్రాంతంలో తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్ల నిర్మాణానికి రూ.1.20 కోట్లు కేటాయించామన్నారు. దివ్యాంగుల కోసం ట్రైసైకిళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాలు పూర్తి చేసి వాటి బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓకు సూచించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డిప్యూటీ సీఈఓ చిరంజీవి, వివిధ శాఖల అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

- జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్‌ను ప్రారంభించిన మంత్రి కాకాణి
- 154 ప్రాజెక్టు నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులు

నెల్లూరు(టౌన్): జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంటోంది. విద్యార్థులు తమ సృజనాత్మక శక్తితో ప్రాజెక్టు నమూనాలను ప్రదర్శించారు. స్థానిక పొదలకూరు రోడ్డులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ప్రారంభించారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో 154 ప్రాజెక్టు నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించేందుకు వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు క్యూ కడుతున్నారు. జిల్లాస్థాయిలో ప్రదర్శించిన ప్రాజెక్టు నమూనాలను కమిటీ సభ్యులు పరిశీలించి వాటిలో ఉత్తమమైన ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్‌కు ఎంపిక చేస్తున్నారు.

1. ప్రాజెక్ట్ – జనరేటర్ ఎలక్ట్రిసిటీ ఫ్రం వేస్ట్ ప్రొడక్ట్



విద్యార్థి పేరు – ఎంఏ నటరాజన్

గైడ్ టీచర్ – మల్లికార్జునరావు

పాఠశాల - జెడ్పీ హైస్కూల్, కృషినగర్, నెల్లూరు

కావాల్సిన పరికరాలు - సోలార్ ప్యానెల్స్, డీసీ బ్యాటరీలు-4, ఏసీ కన్వర్ట్, బల్బులు-3

పనిచేసే విధానం – వేస్ట్ ప్రొడక్ట్‌ను మండించడం ద్వారా వచ్చే హీట్ ఎనర్జీని సోలార్ ప్యానెల్ నుంచి ఎలక్ట్రికల్ ఎనర్జీగా కన్వర్ట్ చేస్తుంది. కన్వర్ట్ అయిన ఎలక్ట్రికల్ ఎనర్జీని డీసీ బ్యాటరీల ద్వారా స్టోర్ చేసుకుని ఏసీ కన్వర్ట్ ద్వారా ఎలక్ట్రిసిటీగా ఉత్పత్తి చేస్తుంది.

2. ప్రాజెక్ట్ – సోలార్ బేస్‌డ్ ఇన్‌సెక్ట్ ట్రాప్

విద్యార్థిని పేరు – రిషిత

గైడ్ టీచర్ – పి.శ్రీనివాసులురెడ్డి

పాఠశాల - జెడ్పీ హైస్కూల్, విడవలూరు

కావాల్సిన పరికరాలు - 12 ఓల్ట్స్ బ్యాటరీ, సోలార్ ప్యానెల్-1, ఎల్‌డీఆర్, ఎల్‌సీడీ, హార్డినో

పనిచేసే విధానం – పెస్టిసైడ్స్ ఉపయోగించకుండా బయోలాజికల్, న్యాచురల్‌గా సోలార్ ఇన్‌సెక్ట్ ద్వారా పురుగులను చంపేయవచ్చు. ఎండ వేడిమిని సోలార్ ప్యానెల్ రిసీవ్ చేసుకుని బ్యాటరీలోకి ఎలక్ట్రికల్ ఎనర్జీగా కన్వర్ట్ చేస్తుంది. ఎల్‌డీఆర్ ఉదయం పూట ఎల్‌డీఆర్‌గా పనిచేసి సాయంత్రం సమయంలో కండక్టర్‌గా మారి పనిచేస్తుంది. ఆటోమేటిక్‌గా ఎల్ఈడీ లైట్స్ ఆన్ అవుతాయి. లైట్ దెబ్బకు పురుగులు, కీటకాలు చనిపోతాయి. ప్రధానంగా పంటలు, మొక్కలు తదితర వాటికి ఉపయోగించవచ్చు.



3. ప్రాజెక్ట్ – స్మార్ట్ అగ్రికల్చర్ ఆన్ టాక్టీస్



విద్యార్థి పేరు – ఎస్‌డీ ముస్కాన్

గైడ్ టీచర్ – రవికాంత్

పాఠశాల - జీవీకే చిన్మయి విద్యాలయం, ఇందుకూరుపేట

కావాల్సిన పరికరాలు – సాయిల్, మాయిశ్చర్ సెన్సార్, వాటర్ లెవల్ సెన్సార్, 3డీ మోడలింగ్, కెమెరా మాడ్యూల్, రిలే మాడ్యూల్, స్ప్రింక్లర్స్, బ్యాటరీప్యాక్, సాయిల్ సపోర్టింగ్ కిట్

పనిచేసే విధానం – ఇంటిపైన టెర్రస్‌పై మొక్కలు, పంటలు సాగు చేసుకోవచ్చు. టెర్రస్‌పై మట్టి పోసి సెన్సార్‌తో ప్లాస్టిక్ కవర్‌తో నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం సెన్సార్లు మట్టిపై పెట్టి సెన్సార్ల ద్వారా మట్టిలో ఉన్న మినరల్స్ శాతాన్ని సెన్సార్ల ద్వారా రీడ్ చేసి అందిస్తుంది. వాల్యూస్ లెవల్స్‌ను మొబైల్ ద్వారా సరిచేసుకోవచ్చు.

4. ప్రాజెక్ట్ – ఆటోమేటిక్ సేవియేజ్ గార్బేజ్ సపరేటర్ ఫ్రం ఓపెన్ కెనాల్స్



విద్యార్థి పేరు – చరణ్

గైడ్ టీచర్ – సోమలింగేశ్వరరావు

పాఠశాల - జెడ్పీహెచ్ఎస్, తూర్పుపల్లి, చేజర్ల మండలం

పరికరాలు - బ్యాటరీ, స్విచ్, గేర్ మోటార్

పనిచేసే విధానం – కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి మురుగునీరు పోకుండా నిల్వ ఉంటోంది. ఎక్స్‌లేటర్ తరహాలో పరికరం తయారు చేసి కరెంట్ గేర్ మోటార్ ద్వారా కాలువల్లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను లేబర్‌తో పనిలేకుండా సులభంగా తొలగించవచ్చు.

క్లుప్తంగా

చంద్రబాబుకు గుణపాఠం చెప్పండి

• ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి



ప్రచారం నిర్వహిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, నాయకులు

సీతారామపురం (ఉదయగిరి): అబద్ధపు హామీలిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడికి ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీతారామపురం మండలంలోని అయ్యవారిపల్లి, సింగారెడ్డిపల్లి గ్రామాల్లో మంగళవారం విజయసంకల్ప ప్రచార యాత్ర జరిగింది. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చింతంరెడ్డి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ చెరుకుపల్లి రమణారెడ్డి, ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి ఆధ్వర్యంలో ప్రజలు రాజగోపాల్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. వచ్చే ఎన్నికలు ధర్మానికి, అధర్మానికి, న్యాయానికి, అన్యాయానికి, కుట్రలు, మంచితనానికి మధ్య జరుగుతున్నట్లు చెప్పారు. జగన్ మహిళలకు అమ్మఒడి, ఆసరా, చేయూత, రైతులకు పెట్టుబడి సాయం, సున్నా వడ్డీ, విద్యార్థులకు విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు ప్రవేశపెట్టారన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లు సకాలంలో అందుతున్నట్లు తెలిపారు. మంచి చేసిన ఆయన్ను ఎన్నుకుంటే ప్రజలకు మరింత సంక్షేమం అందుతుందన్నారు. చంద్రబాబు మరోసారి రాష్ట్రాన్ని దోచుకోవాలని వస్తున్నాడని, ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువనేత మేకపాటి అభినవ్‌రెడ్డి, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, నాయకులు అల్లూరురాజు, కృష్ణ, మాబయ్య, ప్రసాద్, దుగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్పెంటర్ ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): అప్పులు తీర్చలేక కార్పెంటర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరు రామచంద్రాపురం షాదీమంజిల్ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల కథనం మేరకు.. జాకీర్‌హుస్సేన్‌నగర్‌కు చెందిన సయ్యద్ నిషార్ అహ్మద్ (35)కు, కోటమిట్టకు చెందిన యాస్మిన్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వారికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. వివాహానంతరం దంపతులు రామచంద్రాపురంలోని షాదీ మంజిల్ సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. అహ్మద్ కార్పెంటర్ పనులు చేసేవాడు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండటంతో అప్పులపాలయ్యాడు. కుటుంబసభ్యులు కొంతమేర అప్పులు తీర్చారు. అయినా పరిస్థితి కుదుటపడలేదు. సోమవారం యాస్మిన్ తన తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. అహ్మద్ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. మంగళవారం తెల్లవారుజామున చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి షాజిదా నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రెహమాన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు



ఇన్‌స్పైర్ మనక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి

• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
• ఘనంగా జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్
• 154 ప్రాజెక్టుల ప్రదర్శన

నెల్లూరు(టౌన్): 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. వసతులు కల్పించారు. డిజిటల్ విద్యాబోధన, సీబీఎస్ఈ సిలబస్, ఇంగ్లిష్ మీడియం తదితర వాటికి శ్రీకారం చుట్టారు. జగన్ లాంటి వ్యక్తి ఉండటం విద్యార్థులకు వరం' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో నెల్లూరు పొదలకూరు రోడ్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనక్‌ను నిర్వహించారు. దీనిని మంత్రి ప్రారంభించారు. తొలుత ఎంఎస్ స్వామినాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాకాణి మాట్లాడుతూ మా తరంలో నేలమీద కూర్చొని చదువుకున్నామని గుర్తు చేశారు. ఎలాంటి సదుపాయాలు ఉండేవి కాదని చెప్పారు. గతంలో తాను జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఉన్న సమయంలో పాఠశాలల అభివృద్ధికి కృషి చేశానన్నారు. అప్పట్లో సీఎంగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి చొరవతో జెడ్పీ బడుల్లో బల్లలు ఏర్పాటు చేయించామన్నారు. జిల్లాకు పేరు తీసుకొచ్చే విధంగా విద్యార్థులు ప్రాజెక్టులు చేయాలని పిలుపునిచ్చారు.

ఒక్కో విద్యార్థికి రూ.10 వేలు

జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ ఇన్‌స్పైర్ మనక్‌లో భాగంగా ప్రాజెక్టు తయారు చేసేందుకు ఒక్కో విద్యార్థికి రూ.10 వేలు ఇచ్చారని తెలిపారు. ఈ ఏడాది జరిగే పదో తరగతి పరీక్షల్లో జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాలని ఆకాంక్షించారు. మేయర్ స్రవంతి మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. డీఈఓ రామారావు మాట్లాడుతూ జిల్లాస్థాయిలో 154 ప్రాజెక్టులను ప్రదర్శించారన్నారు. వీటిల్లో 16 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మంత్రి కాకాణి, అరుణమ్మ, స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓలు ప్రసన్నలక్ష్మి, రఘుబాబు, శ్రీనివాసులు, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కోసం సైనికుడిలా పనిచేస్తా



మాట్లాడుతున్న అనిల్, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

• నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం. జగనన్న మళ్లీ సీఎం కావాలి. అందుకోసం సైనికుడిలా పనిచేస్తా' అని నెల్లూరు సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్ కుమార్ స్పష్టం చేశారు. నెల్లూరులోని ఎంసీఎస్ కల్యాణ మండపంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2009 నుంచి మూడుసార్లు సిటీ నుంచి పోటీ చేశానని, రెండుసార్లు ప్రజలు గెలిపించారన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంత్రిగా అవకాశం కల్పించారన్నారు. ఆయన ఎక్కడ పోటీ చేయమంటే అక్కడికి వెళ్తానన్నారు. పార్టీ ఆదేశాల మేరకు నరసరావుపేట పార్లమెంట్ నుంచి పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడికి వెళ్లినా నెల్లూరు బిడ్డనేనన్నారు. తనకు ఎవరి మీద కక్షలేదని, వ్యతిరేకంగా మీడియాలో కథనాలు వచ్చినా బాధపడలేదన్నారు. వ్యక్తిగత కారణాలతో కొంతమంది తనకు దూరంగా వెళ్లినా పార్టీ బలహీనపడదన్నారు. కొత్తవారిని తీసుకొస్తామన్నారు. నెల్లూరు సిటీ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా ఖలీల్ అహ్మద్‌కు అవకాశం కల్పించారని, అందరం కలిసి ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపిద్దామన్నారు. నెల్లూరు వదిలి వెళ్తున్నందుకు బాధగా ఉన్నా నరసారావుపేట ఎంపీ పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలందరూ తనకు స్నేహితులేనన్నారు. బుధవారం నరసరావుపేటలో భారీ బహిరంగసభ జరుగుతుందని, అప్పటి నుంచి అక్కడ కార్యక్రమాలు ప్రారంభిస్తామన్నారు. తనను గుండెల్లో పెట్టుకున్న నెల్లూరీయులను మరిచిపోనన్నారు. వారి ఆదరాభిమానాలు ఎప్పటికీ ఉంటాయని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సమావేశంలో కార్పొరేటర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

లబ్ధిదారులే మా స్టార్ క్యాంపెయినర్లు

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు కుటుంబానికి అందాయి. లబ్ధిదారులే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున స్టార్ క్యాంపెయినర్లు' అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన మర్రిపాడులో మంగళవారం విజయాభవ యాత్ర జరిగింది. ఈ సందర్భంగా ఆయన నూతన బస్‌షెల్టర్‌ను ప్రారంభించారు. అలాగే రూ.35 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.20.80 లక్షలతో నిర్మాణం పూర్తి చేసుకున్న రైతు భరోసా కేంద్రం, రూ.17.67 లక్షలతో నిర్మించిన మిల్క్ చిల్లింగ్ సెంటర్‌తోపాటు ఎస్సీ కాలనీలో ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు రాష్ట్రంలోని అని పార్టీలు జతకట్టాయని, కుట్రలు, కుతంత్రాలతో ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. అలాంటి వారి మాటలను నమ్మొద్దని కోరారు. జగనన్నకు దేవుడి దీవెనలు, ప్రజల అండ ఉన్నంత వరకు ఏ పార్టీ ఓడించలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్న కోసం ఓటర్లు ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కాలని కోరారు. కార్యక్రమంలో మర్రిపాడు మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, జేసీఎస్ కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, భీమవరం సొసైటీ అధ్యక్షుడు సోమల మాధవరెడ్డి, బూత్ కమిటీ కన్వీనర్ రేవూరు వేణుగోపాల్‌రెడ్డి, బూధవాడ సొసైటీ చైర్మన్ సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రామ్మోహన్ పాల్గొన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 143
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 252
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 280
లేయర్ చికెన్	: 145



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.80
సన్నవి	: రూ.70
పండ్లు	: రూ.34



సచివాలయంలో కంప్యూటర్ల చోరీ

గుడ్లూరు: గ్రామ సచివాలయంలోని కంప్యూటర్లు చోరీకి గురయ్యాయి. ఈ ఘటన మండలంలోని అమ్మవారిపాళెంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. రెండు రోజుల సెలవులు అనంతరం సిబ్బంది సోమవారం ఉదయం సచివాలయానికి వచ్చారు. అక్కడ రెండు కంప్యూటర్లు, ప్రింటర్ కనిపించలేదు. దీంతో చోరీకి గురైనట్లు గుర్తించారు. సిబ్బంది శుక్రవారం సాయంత్రం విధులు ముగించుకుని వెళ్తూ తాళాన్ని కిటికీలో పెట్టారు. ఈ విషయాన్ని దుండగులు గుర్తించారు. తాళం తీసి కంప్యూటర్లు, ప్రింటర్లు అపహరించారు. బయటకి వచ్చి ఎప్పటి లాగే తాళం వేసి కిటికీలో పెట్టారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి మంగళవారం తెలిపారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో బీసీలకు సముచిత స్థానం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు మస్తాన్‌రావు

• రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

నెల్లూరు(వేదాయపాళెం): 'వైఎస్సార్‌సీపీ పాలనలో బీసీలకు సముచిత స్థానం లభించింది. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థుల గెలుపునకు బీసీ సంఘాల నేతలు కృషి చేయాలి' అని రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త బీద మస్తాన్‌రావు పిలుపునిచ్చారు. నెల్లూరులోని రామచంద్ర కల్యాణ మండపంలో మంగళవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు ఒట్టూరు సంపత్‌రాజు యాదవ్ అధ్యక్షతన బీసీ సామాజిక న్యాయ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. దీనికి బీద ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 50 శాతానికి పైగా ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. మంత్రివర్గంలో 11 మంది బీసీలకు చోటు కల్పించడం గర్వకారణమన్నారు. అసెంబ్లీ స్పీకర్‌గా బీసీకి అవకాశం ఇచ్చారన్నారు. ఇంకా రాజ్యసభ సభ్యులుగా, ఎమ్మెల్సీలుగా నియమించారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ బీసీలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. నెల్లూరు ఎమ్మెల్యే అనిల్ కుమార్‌కు నరసారావుపేట, కారుమూరు సునీల్‌కు ఏలూరు పార్లమెంట్ స్థానాలు కేటాయించినట్లు తెలిపారు. చంద్రబాబు బీసీలను ఎదగనివ్వడంలేదని విమర్శించారు. బీసీలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో చెంచలబాబు యాదవ్, రఘురామ్ ముదిరాజ్, సురేష్, రామరాజు మాట్లాడారు. బీసీ నేతలు బొమ్మి నాగకిశోర్ యాదవ్, దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్, తన్నీరు కోటయ్య, కేవీ శేషయ్య, కప్పిర శ్రీనివాసులు, సమాధి శ్రీనివాసులు, వెంగళరావు, దోనేపూడి కోటేశ్వరరావు, విజయమ్మ, జనార్దన్, తాళ్లూరు రాము తదితరులు పాల్గొన్నారు.

ఆ సర్వేలు టీడీపీ సృష్టి.. ఎవరూ నమ్మొద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు (కోవూరు): 'వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తామని టీడీపీ ఫేక్ సర్వేలు సృష్టించి జనంలోకి వదులుతోంది. వాటిని ఎవరూ నమ్మొద్దు. పెద్ద సంస్థలన్నీ వైఎస్సార్‌సీపీదే విజయమని స్పష్టం చేస్తున్నాయి' అని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. కోవూరులోని పీవీఆర్ కల్యాణ మండపంలో పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబుకు తొత్తులుగా వ్యవహరించే సంస్థల మినహా మిగిలినవి 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయమని తేల్చాయన్నారు. నకిలీ సర్వేలను అడ్డం పెట్టుకుని టీడీపీ అధికారంలోకి వచ్చేస్తోందని బాబు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సీ ఓటరు సర్వేకు విశ్వసనీయత లేదని, 2019 ఎన్నికల్లో వారు చెప్పిందే నిదర్శనమన్నారు. టీడీపీకి 15 ఎంపీలు, వంద ఎమ్మెల్యే స్థానాలు వస్తాయని చెప్పారని, కానీ 23 ఎమ్మెల్యేలతోనే సరిపెట్టుకోవడాన్ని అందరం చూశామన్నారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికల్లోనూ వారి సర్వే తలకిందులైందన్నారు. ఓటమి భయంతోనే టీడీపీ పొత్తులతో వస్తున్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ చాలా బలంగా ఉందన్నారు. టీడీపీ అభ్యర్థుల కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొందని చెప్పారు. కార్యక్రమంలో డీసీఎంఎస్, డీఏఏబీ చైర్మన్లు వీరి చలపతిరావు, డి.నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్ కుమార్‌రెడ్డి, ఎంపీపీ టి.పార్వతి, జెడ్పీటీసీ కె.శ్రీలత, మండల కన్వీనర్ ఎన్.సుబ్బారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఆర్.మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరిన 16వ వార్డు వాసులు

కావలి: పట్టణంలోని వైకుంఠపురం, బాలకృష్ణారెడ్డి నగర్ ప్రాంతాలకు చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. వైకుంఠపురంలోని దర్గా ప్రాంతంలో ఉంటున్న షేక్ అబ్దుల్, షేక్ ఫరూక్, రఫీ, షరీఫ్, గాంధీ కాలనీలో నివాసం ఉంటున్న కోటకొండ వాసు (రెడ్డప్ప), గుంజి అంకయ్య, ఉప్పాల కృష్ణ, రాజేష్, మోజెస్, దార్ల మాధవరావు, స్వర్ణ గోవిందరావు తదితరులకు ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే బాలకృష్ణారెడ్డి నగర్ పరిసర ప్రాంతాలకు చెందిన 16వ వార్డులోని 50 కుటుంబాలు ఆ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరాయి. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.